క్లుప్తంగా

రేపు మహిళలకు ఉచిత ఓపీ

గుంటూరు మెడికల్: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న మహిళలందరికీ ఉచిత ఓపీ సేవలను అందించనున్నట్లు ఆధునిక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కడియాల శిల్ప సింధూర తెలిపారు. నగర మహిళలంతా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

రేపు జీజీహెచ్‌లో మహిళా ఉద్యోగులకు సన్మానం



గుంటూరు మెడికల్: అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని గుంటూరు జీజీహెచ్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటనల్ ఆధ్వర్యంలో ఈనెల 8న మహిళా సిబ్బందికి సన్మానం చేయనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ తెలిపారు. జీజీహెచ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిది మంది స్టాఫ్ నర్సులు, ఆరుగురు వైద్యులకు స్టార్ మహిళలుగా గుర్తించి బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. న్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటనల్ అధ్యక్షుడు పి.బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ట్రాఫిక్ బారికేడ్స్ అందజేసిన కిమ్స్ శిఖర హాస్పిటల్



గుంటూరు మెడికల్: సామాజిక బాధ్యతలో భాగంగా నగరంలోని కిమ్స్ శిఖర హాస్పిటల్ 200 ట్రాఫిక్ బారికేడ్స్‌ను పాత గుంటూరు ట్రాఫిక్ పోలీసులకు అందించింది. హాస్పిటల్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ అద్విక్ బొల్లినేని, కిమ్స్ శిఖర హాస్పిటల్ సీఈఓ సుధాకర్ బారికేడ్స్‌ను ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, ట్రాఫిక్ సీఐ అశోక్ నేతృత్వంలో గురువారం అందజేశారు. బారికేడ్స్‌ను అందించిన హాస్పిటల్ యాజమాన్యానికి ట్రాఫిక్ పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

13 నుంచి తిరుపతమ్మ తల్లి ఉత్సవాలు



నగరంపాలెం: పాత గుంటూరు సుద్దపల్లి డొంక రోడ్డులోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి 27వ కల్యాణ బ్రహ్మోత్సవాలను ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆనం సంజీవరెడ్డి తెలిపారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గురువారం తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గోడ ప్రతులను ఆవిష్కరించారని పేర్కొన్నారు. 13న జల బిందెల కార్యక్రమం, 14న కల్యాణ మహోత్సవం ఉంటుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో సాంబశివరావు, బి.కృష్ణ, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



నగరంపాలెం: స్థానిక మారుతీ నగర్‌లోని శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీ మారుతి దేవాలయ 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శ్రీ అలివేలు మంగ, శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. తూర్పు రాజగోపుర కలశాలు స్థాపన చేపట్టారు. మధ్యాహ్నం మహా పూర్ణాహుతి జరిపారు. కలశ ఉద్వాసన చేసి బలిహరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో రంగారావు దంపతులు, సురేష్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ కార్యదర్శి తంగిరాల శ్రీనివాసరావు, సభ్యులు కొరపాటి రామారావు పాల్గొన్నారు.

అబాకస్‌లో భారతీయ విద్యాభవన్ విద్యార్థుల సత్తా

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో భారతీయ విద్యాభవన్ విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల ప్రధాన కార్యదర్శి పి. రామచంద్రరాజు తెలిపారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని విశ్వం ఎడ్యుటెక్ ఈనెల 2వ తేదీన నిర్వహించిన జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో తమ పాఠశాల 4వ తరగతి విద్యార్థి కె. కార్తికేయ ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. 5వ తరగతి విద్యార్థి జి. కిశోర్ కుమార్ కన్సొలేషన్ బహుమతి పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కోశాధికారి కె. రామ్ సుభాష్, ప్రిన్సిపాల్ హేమాంబ, హెచ్‌ఎం కృష్ణ ఉషశ్రీ పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ విస్తరణతో నరకయాతన

- మూడు వంతెనల ప్రారంభంపై స్పష్టత ఇవ్వని రైల్వే అధికారులు
- తొలుత ఫిబ్రవరి 25వ తేదీ నాటికి పూర్తి చేస్తామని ప్రకటన
- సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వే గేట్ల వద్ద ఇరుక్కుపోతున్న వాహనదారులు
- పరీక్షలు రాస్తున్న ఇంటర్ విద్యార్థులకు అవస్థలు



మూడు వంతెనలు వద్ద జరుగుతున్న పనులు

నెహ్రూనగర్: మూడు వంతెనల వద్ద రైల్వే ట్రాక్ విస్తరణ పనులు ఇంకా కొలిక్కి రాలేదు. ఎప్పటికి పూర్తవుతాయో రైల్వే అధికారులు కూడా సరిగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. రైల్వే ట్రాక్ విస్తరణ నిమిత్తం నవంబర్ 25వ తేదీ నుంచి మూడు వంతెనల మీదుగా రాకపోకలు నిలిపివేసిన విషయం తెలిసిందే. 60 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని రైల్వే అధికారులు చెప్పారు. గడువు పూర్తయినా ఇంత వరకు పూర్తి చేయకపోవడంతో నగర ప్రజలు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టూ టౌన్ నుంచి వన్ టౌన్‌లోకి రావడానికి, వన్ టౌన్ నుంచి టూ టౌన్‌లోకి రావడానికి అవస్థలు పడుతున్నారు. సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వేగేటుల వద్ద ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుపోతున్నారు. రైల్వే అధికారుల మాటలు నమ్మి నగరపాలక సంస్థ అధికారులు ట్రాక్ కింద పైపులైన్ కూడా మార్చారు. తొలుత ఫిబ్రవరి 25వ తేదీ నాటికి పనులు పూర్తి చేస్తామని రైల్వే అధికారులు తెలియజేశారు. మార్చి 6వ తేదీ వచ్చిన కూడా పనులు జరుగుతూనే ఉన్నాయి. వంద రోజుల పైబడి జరుగుతుండటంతో నగర ప్రజలు సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వే గేటుల వద్ద ఎండల్లో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

విద్యార్థులకు అవస్థలు

ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. టూ టౌన్ నుంచి వన్ టౌన్‌లోని కొన్ని సెంటర్లకు, వన్ టౌన్ నుంచి టూ టౌన్‌లోని కొన్ని సెంటర్లలో పరీక్షలు రాసేందుకు విద్యార్థులు ప్రతి రోజు ఈ రైల్వే గేటుల మీదుగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. అయితే, ఉదయం రైల్వే గేటు పడి రెండు, మూడు రైళ్లు వెళ్లే దాకా తీయకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు పనులను వేగవంతం చేసి రాకపోకలు సాగించే దిశగా అడుగులు వేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

రైల్వే గేట్లతో అవస్థలు



ఉదయం, రాత్రి పూట రెండు, మూడు రైళ్లు వెళ్లే దాకా గేటులు తీయడం లేదు. దీంతో ట్రాఫిక్‌లో చిక్కుకుపోవాల్సి వస్తోంది. రైల్వే అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేసి, మూడు వంతెనల మీదుగా రాకపోకలు సాగించేందుకు చర్యలు తీసుకోవాలి.

– జగదీష్, నెహ్రూనగర్



తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన పార్టీ గుంటూరు నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా

11 నుంచి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

- కమిషనర్ పులి శ్రీనివాసులు
- శంకర్ విలాస్ వద్ద ఆర్‌ఓబీ పనులు ప్రారంభానికి అధికారులు సిద్ధం
- హిందూ కాలేజీ నుంచి నగరంపాలెం వరకు ఆక్రమణల తొలగింపు



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలోని శంకర్ విలాస్ ఆర్‌ఓబీ పనులు ప్రారంభం దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా హిందూ కాలేజీ జంక్షన్ నుంచి నగరంపాలెం, పట్టాభిపురం మెయిన్ రోడ్డు, స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల వరకు రోడ్డు, డ్రెయిన్ ఆక్రమణలను ఈ నెల 11 నుంచి తొలగింపు చేపడతామని కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆక్రమణదారులు 10వ తేదీ లోపు స్వచ్ఛందంగా తొలగించుకొని జీఎంసీకి సహకరించాలని ఆయన కోరారు. శంకర్ విలాస్ బ్రిడ్జి ప్రారంభమైతే నగరంపాలెం రోడ్డు ప్రధాన ప్రత్యామ్నాయ రహదారి కానున్నదని, ఆక్రమణల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. ఇప్పటికే దశల వారీగా ఓల్డ్ క్లబ్ రోడ్డు, జీటీ రోడ్డు, జీజీహెచ్ పరిసరాలు, అమరావతి రోడ్డు, కొరిటెపాడు మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు చేపట్టామని పేర్కొన్నారు. మూడు వంతెనల నుంచి శారదా కాలనీ, అమరావతి రోడ్డులో విస్తరణ పనులు ప్రారంభించనున్నామని వెల్లడించారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించుకుని సహకరించాలని, లేనిపక్షంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

నగరంలో వార్డు సచివాలయాల వారీగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ప్రతిపాదనల మేరకు ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టడానికి వీలుంటుందని ఆయన ఇంజినీరింగ్ అధికారులు, ఎమినిటీ కార్యదర్శులకు స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ ఏటీ అగ్రహారం, నల్లకుంట, పట్నంబజార్, శ్రీనివాసరావు తోట, ఏటుకూరు, బొంతపాడు తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. శ్రీనివాసరావుతోటలో వార్డు సచివాలయ భవనాన్ని తొలగించి, నూతన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈఈని ఆదేశించారు. శ్రీనివాసరావుతోట అవుట్ ఫాల్ డ్రెయిన్‌కి కల్వర్ట్‌ల వద్ద రక్షణ గోడలు నిర్మించాలని చెప్పారు. నల్లచెరువు మెయిన్ రోడ్, పట్నంబజార్‌ల్లో డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించడంతో పాటు శుభ్రం చేయాలని ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు. ఏటుకూరులో అభివృద్ధి పనులను పరిశీలించారు. నూతన రోడ్ల నిర్మాణానికి ముందు తప్పనిసరిగా డ్రెయిన్ నిర్మాణం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ స్పష్టం చేశారు. అనంతరం నల్లచెరువు మెయిన్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌లో టిఫిన్ చేశారు. ప్రతి రోజు డిమాండ్‌కి అనుగుణంగా ఆహారాన్ని తెప్పించాలని అక్షయ పాత్ర సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, డీఈఈలు మధుసూదన్, సతీష్, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుకోవాలి

గుంటూరు నగరాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దడానికి నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగర పాలకసంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ప్రజారోగ్య, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో తప్పనిసరిగా డోర్ టు డోర్ చెత్త సేకరణ నూరు శాతం జరగాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు పాల్గొన్నారు.

యువ వైద్యులు పల్లెబాట పట్టాలి



డిగ్రీ పట్టాలు పొందిన యువ వైద్యులతో మంత్రి సత్యకుమార్ యాదవ్

- మంత్రి సత్యకుమార్ యాదవ్
- ఘనంగా కాటూరి మెడికల్ కాలేజీ స్నాతకోత్సవం

గుంటూరు మెడికల్: యువ వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో పేద రోగులకు వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. చినకొండ్రుపాడులోని కాటూరి మెడికల్ కాలేజీలో బుధవారం రాత్రి 2019 బ్యాచ్ ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య వృత్తిలో ప్రవేశించే వారు సేవాభావం కలిగి ఉండాలని, రోగుల సమస్యలను చిరునవ్వుతో ఆలకించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు పనిచేస్తే రోగుల ఇబ్బందులు తెలుస్తాయని చెప్పారు. మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వంతోపాటు, ప్రైవేటు భాగస్వామ్యం కూడా కావాలని పేర్కొన్నారు. రోగులపై సేవాభావం కలిగి ఉండాలని, నిరంతరం విద్యార్థుల మాదిరిగా ఉండి ఎప్పటికప్పుడు మెళకువలను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాటూరి మెడికల్ కాలేజ్ చైర్మన్ కాటూరి సుబ్బారావు, ఈఎస్ఎల్ గ్రూపు సంస్థల చైర్మన్ డాక్టర్ జి. భాస్కరరావు, డాక్టర్ మాదల శ్రీనివాసరావు, కాటూరి మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ కె.ఎస్.వరప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ చల్లా మోహనరావు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ స్వైరారావ్ పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు మెడికల్: నగర, గ్రామ ఆరోగ్య కార్యదర్శులు పని భారం, సమస్యలతో ఒత్తిడికి గురవుతున్నారని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో గురువారం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్య కార్యదర్శులకు పదోన్నతులతో పాటు బకాయిలు, అలవెన్స్‌ల మంజూరు తదితర సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. వృత్తికి సంబంధం లేని పనులు చెయ్యాలని ఒత్తిడి చేస్తున్నారని, ఆ విధుల నుంచి తప్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా శాఖ సంయుక్త కార్యదర్శి కె.ఎస్.సుకుమార్, నగర శాఖ అధ్యక్షుడు ఎస్.పి.ఎస్.సూరి, నగర శాఖ సంయుక్త కార్యదర్శి రాజూనాయక్, ప్రత్తిపాడు తాలూకా అధ్యక్షుడు సీహెచ్.అనిల్ కుమార్, ఏఎన్ఎం సంఘ నాయకులు పాల్గొన్నారు.

రేపు సినీ సంగీత విభావరి

నగరంపాలెం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మహిళా సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ ఈవెంట్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మునిపల్లె రమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి రోడ్డులోని శ్రీ అన్నదాన సమాజం ఆడిటోరియంలో సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమవుతుందని ఆమె పేర్కొన్నారు. సంగీత ప్రియులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ వినతి

లక్ష్మీపురం: సీపీఐ గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో 9వ డివిజన్ సుద్దపల్లి డొంక, యానాది కాలనీలో ఇళ్లు లేని పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు స్థలాల ఇవ్వాలని కోరుతూ పలువురు 27వ నంబర్ సచివాలయం కార్యదర్శికి అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఇసుక, ఇటుక, కంకర రేట్లు పెరిగిన కారణంగా ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బలవంతపు ఆన్‌లైన్ కొనుగోళ్లు ఆపాలి

లక్ష్మీపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రూరల్ మహిళా ఉత్సవ్–2025 పేరుతో సర్ఫ్ అధికారులు డ్వాక్రా మహిళలతో బలవంతపు ఆన్‌లైన్ కొనుగోళ్లు ఆపివేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు దండా లక్ష్మీనారాయణ, బి. లక్ష్మణరావు అధికారులను డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారుల నిర్ణయం వల్ల యానిమేటర్లకు తొమ్మిది వేల నుంచి 14 వేల రూపాయల వరకు అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గిన్నిస్ రికార్డు పొందాలనే ఆత్రుతతో డ్వాక్రా మహిళలను, అప్పులు పాలు చేసే విధానాన్ని మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు జి. రమణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భారతీయ నారీ శక్తి ఉత్సవం



విజేతలను అభినందిస్తున్న ఆచార్య రత్నషీలామణి, తదితరులు

ఏఎన్‌యూ: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం శాఖ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారతీయ నారిశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, ఫన్ గేమ్స్, పోస్టర్ ప్రెజెంటేషన్, ఒక నిమిషం మాట్లాడడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ టి. రాధాబాయి, విశిష్ట అతిథిగా అఖిల భారతీ యవ విద్యార్థి పరిషత్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ సూళ్లూరు చంద్ర పాల్గొన్నారు. ఆర్ట్స్, కామర్స్ లా కళాశాల ఆచార్యులు ఎం. సురేష్ కుమార్, ఎంబీఏ, కామర్స్ విభాగ పీఠాధిపతి ఆచార్య రామినేని శివరాం ప్రసాద్, విశ్వవిద్యాలయ ఏబీవీపీ అధ్యక్షురాలు చంద్రిక, కార్యదర్శి వంశీ, కార్యకర్తలు పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ అతిథుల చేతుల మీదుగా అందజేశారు.

ఏఎన్‌యూలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సివిల్ అండ్ మెకానికల్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు క్వాడ్ జన్ వైర్‌లెస్ సొల్యూషన్స్ కంపెనీ ఆన్ క్యాంపస్ డ్రైవ్ గురువారం నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు శిక్షణ అనంతరం సంవత్సరానికి రూ. 3 లక్షల ప్యాకేజీతో కంపెనీ ఆన్‌రోల్‌లో తీసుకుంటారని ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. సిద్ధయ్య ,అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. గోపీకృష్ణ, డాక్టర్ డి. చంద్రమౌళి, కంపెనీ సిబ్బంది బి. శ్రావణ్ కుమార్, హెచ్‌ఆర్ టి. రాజేష్, టెక్నికల్ మేనేజర్లు ఎం. ప్రమీల, పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సులతో నైపుణ్యాన్ని పెంచుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హనుమంతరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు ఫార్మసీ డిగ్రీతో పాటు సర్టిఫికెట్ కోర్సులను చదివి, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విశ్రాంత ఔషధ నియంత్రణ మండలి అధికారి డి. హనుమంతరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం ఫార్మసీ పితామహుడు ప్రొఫెసర్ మహదేవ్‌లాల్ ష్రాఫ్ జయంతి సందర్భంగా జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవాన్ని ఫార్మా అన్వేషణ్–2005 పేరుతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హనుమంతరావు మాట్లాడుతూ ఫార్మసీ నిపుణులు ఔషధ రంగంతో పాటు సౌందర్య సాధనాలు, ఆయుర్వేద ఔషధాలు, స్పైసెస్ తయారీకి చిన్న తరహా పరిశ్రమలను ప్రారంభించాలని సూచించారు. వ్యవస్థాపకులుగా ఎదిగి మరి కొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. కళాశాల పాలకమండలి అధ్యక్షుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ మన దేశంలో మొదటిసారిగా బనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో అప్పటి వీసీ మదన్ మోహన్ మాళవ్యా పర్యవేక్షణలో ప్రొఫెసర్ మహదేవ్ లాల్ ష్రాఫ్ బీఎస్సీ ఫార్మసీ కోర్సును ప్రవేశపెట్టారని తెలిపారు. కళాశాల పూర్వ చైర్మన్ డాక్టర్ ఎం. రాధాకృష్ణమూర్తి ప్రొఫెసర్ మహదేవ్ లాల్ ష్రాఫ్ జీవిత చరిత్ర, విద్యాభ్యాసం, ఫార్మసీ రంగంలో ప్రారంభించిన అసోసియేషన్లు, ప్రచురించిన పాఠ్య పుస్తకాలు, పత్రికల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్. మధుసూదనరావు, హిందూ పీజీ కళాశాల ఎంబీఏ విభాగాధిపతి రమణ, విజ్ఞాన్ వర్సిటీ ఫార్మసీ ప్రాక్టీసు డీన్ జి. సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ ఎంపీ నాగభూషణం, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువకుడిపై బ్లేడ్‌తో దాడి

లక్ష్మీపురం: చుట్టుగుంట సెంటర్ వద్ద టపాసులు పేలుస్తున్న వారిని వారించిన వ్యక్తిపై మద్యం మత్తులో బ్లేడ్‌తో దాడి చేసిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటీ అగ్రహారానికి చెందిన నాగేశ్వరరావు మృతి చెందాడు. మృతదేహాన్ని చూసేందుకు చుట్టుగుంట ప్రాంతానికి చెందిన గాజుల నాగరాజుతో పాటు అతని స్నేహితులు, నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లు, బబ్లు, ప్రవీణ్, దేవా, మరి కొంతమంది కలిసి వచ్చారు. నాగేశ్వరరావు మృతదేహాన్ని తీసుకుని శ్మశానవాటికకు బయలుదేరారు. ఈ క్రమంలో బబ్లు, ప్రవీణ్, దేవాలు ముందు టపాసులు పేల్చుతున్నారు. అవి ఏటీ అగ్రహారంలో ఉన్న ఎస్‌కేబీఎం స్కూల్‌లో పడుతుండటంతో గాజుల నాగరాజు వారించాడు. స్కూల్‌లోకి టపాసులు వదల వద్దని చెప్పాడు. తమను వారించే అంతటి వాడివి అయ్యావా ! అంటూ రౌడీషీటర్లు బబ్లు, ప్రవీణ్‌లతో పాటు దేవాలు కలిసి అతడిపై బ్లేడ్‌తో దాడి చేసి గాయపరిచారు. బాధితుడి నాగరాజును స్నేహితులు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న నగరంపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఘటన జరిగిన వైనాన్ని అడిగి తెలుసుకున్నారు. బాధితుడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీ లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 4/2వ అడ్డరోడ్డులోని శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభించారు. తొలుత గోపూజ, గణపతి పూజ, కలశ స్థాపన, నవగ్రహారాధన నిర్వహించారు. అనంతరం శ్రీ సిద్ధి బుద్ధి సమేత గణపతి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. హారతి, మంత్ర పుష్పం అనంతరం దంపతులకు, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ప్రధాన పూజారి మర్రిపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 16న బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. చివరి రోజు స్వామి కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు.

మే 18 నుంచి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సభలు

లక్ష్మీపురం: గుంటూరులో మే 18 నుంచి 20 వరకు జరగనున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఉపాధ్యక్షులు సీహెచ్. నాగబ్రహ్మాచారి, సీపీడీసీఎల్ అధ్యక్షులు దాసరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక బ్రాడీపేటలోని సీఐటీయూ నగర కార్యాలయంలో గురువారం రాష్ట్ర మహాసభల ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నేషనల్ కో–ఆర్డినేషన్ కమిటీ పేరుతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బి. లక్ష్మణరావు, నాయకులు సుబ్బారెడ్డి, రాం ప్రభాకర్, చెన్నకేశవులు, చంద్రశేఖర్ ఆచారి, గాలిబ్ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

లక్ష్మీపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న జిల్లాస్థాయి సదస్సులో మహిళలంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రెంటాల కుమారి తెలిపారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల హక్కులు సాధించుకునేందుకు నిరంతరం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య పాటుపడుతోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ. 15వేలు ఆర్థిక సాయం, మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. మొదటి విడతలో కొంత మందికి మాత్రమే ఇచ్చారని విమర్శించారు. తల్లికి వందనం పేరుతో తల్లిదండ్రులని కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని తెలిపారు. శనివారం జరిగే సదస్సులో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, ఐఏఎల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జేఎస్‌ఆర్, డాక్టర్ పుష్ప ప్రియాంక, డీఎల్ఎఫ్ ప్యానల్ అడ్వకేట్ గోనుపు శ్యామల, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు పాల్గొంటారని తెలిపారు.